ఈ సమస్యకు పరిష్కారం ఎన్నడో?

- దశాబ్దాలుగా రోడ్లపై పారుతున్న మురుగునీరు
- దోమల వృద్ధితో తప్పని రోగాల బెడద
- డ్రైనేజీ సదుపాయం కల్పించాలని స్థానికుల మొర



నల్లమాడలోని మసీదు వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నల్లమాడ: ఈ సమస్యకు పరిష్కారం ఎన్నడో అంటూ మండల కేంద్రంలోని పాతవూరు ప్రజలు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేని కారణంగా దశాబ్దాల తరబడిగా మురుగునీరు ఇళ్ల ముందు రోడ్లపై నిత్యం ప్రవహిస్తోంది. ఫలితంగా రాకపోకలకు దాదాపు 500పైగా కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు.

పాచిపట్టిన రోడ్లు..

అసలే ఇరుకై న రోడ్లు.. ఏళ్ల తరబడిగా నిత్యం వాటిపై నీరు ప్రవహిస్తుండటంతో రోడ్లు పాచిపట్టాయి. ఏమాత్రం అజాగ్రత్త వహించినా జారి కిద పడటం, కాలో, చేయో విరగటం ఖాయం. ఇదివరకు వృద్ధులు, చిన్నారులు, ద్విచక్ర వాహనదారులు జారి క్రింద పడటంతో కాళ్లు, చేతులు విరిగిన దాఖలాలు చాలానే ఉన్నాయి. మెయిన్ బజార్‌కు ఆనుకొని ఉన్న సత్యమ్మ కూడలి, రామాలయం వీధి, కుమ్మరి వీధి తదితర ప్రాంతాల నుంచి కొళాయిల నుంచి సరఫరా అయ్యే నీరు దిగువన ఉండే మసీదు వీధి, జెండా మాను వీధి గుండా ఎస్సీ కాలనీలోకి, అక్కడి నుంచి దిగువన ఉండే పొలాల్లోకి పారుతున్నాయి. వీటికితోడు పలువురు రోడ్లపై పాత్రలు కడగటం, దుస్తులు ఉతకడం చేస్తుండటంతో ఆ మురుగునీరు కూడా రోడ్లపై పారుతోంది. మురుగునీరు తమ ఇళ్లముంగిటకు రాకుండా ప్రతి ఇంటి ముందు మట్టితో అడ్డకట్టలు వేసుకున్నారంటే అతిశయోక్తి కాదు.

వర్షాకాలంలో రోగాల బెడద

రోడ్లపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తుండటంతో దుర్వాసన ఇళ్లలోకి వస్తోంది. అన్నం తినాలన్నా ఇబ్బందికరంగా ఉందని, అక్కడక్కడా రోడ్లపై నీరు నిలబడిపోవడంతో దోమలు వృద్ధి చెంది ముఖ్యంగా వర్షాకాలంలో రోగాల సోకే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాతబస్తీ, ఎస్సీ కాలనీలో నెలకొన్న మురుగునీటి సమస్యను గతంలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, మండల స్థాయి అధికారులు పరిశీలించి వెళ్లారు. ఎంత మంది నాయకులు, అధికారులు మారినా మా సమస్య మాత్రం తీరకుందని స్థానికులు నిట్టూరుస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఇళ్ల ముందు రోడ్లపై మురుగునీరు పోతుండటంతో రోడ్లు పాచిపట్టాయి. దీంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీటితో దుర్వాసన ఇళ్లలోకి వస్తోంది. దోమలు ఎక్కువై రోగాల బారిన పడుతున్నాం. ఎంతమంది అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుంది. ఉన్నతాధికారులైనా స్పందించాలి.

– ఎస్. షబ్బీర్, నల్లమాడ

అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రం నల్లమాడలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. అండర్ డ్రైనేజీ ఏర్పాటుతోనే సమస్య పరిష్కారం అవుతుంది. అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో నాయకులు ప్రకటనలు చేశారు. ఇప్పటికై నా పాలకులు వాటిని అమలు చేయాలి.

– గోవిందు, సీపీఎం మండల కార్యదర్శి

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

ధర్మవరం: పట్టణంలోని మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పేరిట సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయకపోవడాన్ని వివరిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నేడు కదిరిలో..

కదిరి అర్బన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో కదిరి మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ ప్రముఖులు హాజరయ్యే సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు

ధర్మవరం: సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విద్యుత్ శాఖ షిఫ్ట్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. పట్టణంలో పాదయాత్ర చేపట్టిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఆదివారం షిఫ్ట్ ఆపరేటర్లు కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మందికి పైగా షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించారని, పాత ఆపరేటర్లకు రూ.27,953 వేతనం వస్తోందని తమకు వారికి రూ.10 వేలు తేడా ఉందన్నారు. ఒకే సబ్‌స్టేషన్‌లో ఒకే రకమైన డ్యూటీ చేస్తున్న ఆపరేటర్ల మధ్య వేతన వ్యత్యాసం సరిచేయాలని కోరారు.

మాజీ సర్పంచ్ శివారెడ్డి మృతి

తలుపుల : మండలంలోని పల్లవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మాజీ సర్పంచ్ పి. శివారెడ్డి (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి ఆదివారం శివారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండారెడ్డి, మాజీ ఎంటీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఓబులరెడ్డి, గజపతిరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూ టౌన్ సీఐ రెడ్డెప్ప

ధర్మవరం అర్బన్: రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ రెడ్డెప్ప హెచ్చరించారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లుగా ముద్ర వేసుకుని సమాజంలో జీవించాలంటే చాలా కష్టంగా ఉంటుందని, దాన్ని తొలగించుకునేందుకు సత్ప్రవర్తన ఒక్కటే మార్గమని సూచించారు.

హత్యాస్థలం పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి అర్బన్: ఈ నెల 11న కదిరి మండలం బండవాండ్లపల్లిలో నవీన్‌కుమార్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆదివారం డీఎస్పీ శివనారాయణస్వామి హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఓడీచెరువు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, వాహనాల రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాలు తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలే అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, చలానాలు పెండింగ్ లేకుండా చెల్లించాలని, మద్యం సేవించి వాహనాలు, నడపరాదని సూచిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి మీ ప్రాణాలు మీరే కాపాడుకోవాలని తెలియజేశారు. అలాగే పాతనేరస్తులు, రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చారు. శక్తి యాప్‌ను మహిళలను డౌన్‌లోడ్ చేసి యాప్‌పై మహిళలకు అవగాహన కలిగిస్తున్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తలుపుల : అలవిగాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి రాగానే అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు ఆర్.రమేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం తలుపులలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాలు ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.ఫయాజ్ అహమ్మద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ పరిశీలకుడు ఆర్.రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు హామీలను తుంగలో తొక్కి స్వప్రయోజనాల కోసం నిధులు మళ్లించడంలో ముందున్నారని మండిపడ్డారు. గతంలో అర్హులైన వారిని ప్రస్తుతం అనర్హులుగా చేర్చడానికి రకరకాల ఎత్తులతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నికల హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసి.. అర్హులందరికీ వర్తింపజేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, కుర్లి శివారెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు జయరాం, మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, చెన్నారెడ్డి, జిల్లా యాక్టివిటీ సెక్రెటరీ చెన్న కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మల్లినాయుడు, షేక్షావలి, సుగుణమ్మ, దివాన్‌వలి, టీపీ రమణ, పెద్దినాయుడు, మనోహర్‌నాయుడు, ఎంపీటీసీలు క్రిష్ణ, బావాజీ, జనరల్ సెక్రటరీ యరమరెడ్డి, నాయకులు వివేకానందరెడ్డి, శివారెడ్డి, ఉత్తారెడ్డి, గంగాదర్, మౌలా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచక పాలనపై పోరాడుదాం

- ప్రభుత్వ వైఫల్యాలను తెలియజెప్పేందుకే 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'
- కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్



క్యూ ఆర్ కోడ్ పోసర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నల్లచెరువు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలనపై పోరాడుదామని వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి(ఆర్గనైజేషన్ యాక్టివిటీ) వజ్రభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి హాజరయ్యారు. సందర్భంగా మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలనూ మోసగిస్తున్నారన్నారు. జగన్ ఇస్తున్నవే కాకుండా అంతకు మించి ఇస్తానని చెప్పడమే కాకుండా ఏకంగా బాండ్లను కూడా ఇచ్చి సీఎం చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టారన్నారు. ఆడ బిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేయలేదన్నారు. చంద్రబాబు పాలనలో ప్రతి కుటుంబానికి ఎంత నష్టం అనేది ప్రజలకు తెలియజేసి ప్రజలను చైతన్య పరచాలన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని పార్టీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వ్యతి రేకతను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్ సిక్స్ హామీలు వస్తాయని, చంద్రబాబు ప్రజలకు చేసిన మోసం వివరాలు కూడా వస్తాయన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ శ్రేణులను వేధించడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్ర కార్యదర్శులు పూల శ్రీనివాసరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు రఫి, సోమిరెడ్డి, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, కె. రమణారెడ్డి, ఎంపీటీసీలు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ యూసుఫ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గౌరమ్మ, హైటెక్ రమణ, ఎం, కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, మాజీ సర్పంచులు అక్బర్, రమణారెడ్డి, శ్రీకంఠరెడ్డి, మైనార్టీ నాయకులు బాబాఖాన్, నజీర్, జిలాన్ బాషా, కరీం ఖాన్, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రవులు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: దేశంలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు పేర్కొన్నారు. వచ్చే నెల 3న రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమం కరపత్రాలను పట్టణంలో ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. రాజకీయ పార్టీలు చట్టబద్ధమైన రిజర్వేషన్ల కోసం కృషి చేయాలన్నారు. దాదాపు 56 శాతం ఉన్న బీసీ జనాభాకు 46 శాంత రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సన్మాన కార్యక్రమానికి బహుజన ఉద్యోగులు, మేధావులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలు, కవులు, కళాకారులు హాజరుకావాలని కోరారు.రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ నారాయణనాయక్, బీసీ నాయకులు బాలకృష్ణయాదవ్, మోహన్ గాంధీ, మైనార్టీ నాయకులు అష్రఫ్, సలామ్, హరికృష్ణ, గంగాద్రి, రాజా, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దేవతకు బోనాలు



గంగిరెడ్డిపల్లిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



ధర్మవరంలో బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం పలు వార్డుల నుంచి మహిళలు దుర్గమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. మహిళలు తలపై బోనాలను పెట్టుకుని పురవీధుల్లో డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నేసేపేట, రాజేంద్రనగర్, యాదవవీధి, దుర్గానగర్‌లోని ప్రజలు పెద్దమ్మ దేవత, దుర్గమ్మ దేవతకు బోనాలు సమర్పించారు.

కదిరి టౌన్: గంగిరెడ్డిపల్లి కాలనీలో వెలసిన సత్యమ్మ అమ్మవారికి కాలనీవాసులు బోనాలు సమర్పించారు.ఆదివారం కాలనీ నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తినపెట్టుకొని వేమారెడ్డి సర్కిల్ మీదుగా సత్యమ్మకు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో చిన్నపీర్ల జలధి



తాడిమర్రిలో చిన్న పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



అగ్నిగుండ ప్రవేశాన్ని తిలకిస్తున్న ప్రజలు



చిగిచెర్లలో జలధికి వెళుతున్న పీర్లు

తాడిమర్రి: మండల కేంద్రంలో ఆదివారం చిన్నపీర్లను భక్తిశ్రద్ధలతో జలధికి తీసుకెళ్లారు. మసీదు వీధిలో ఈ ఏడాది నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిలో నాలుగు రోజుల క్రితం అక్బర్, హుస్సేన్, హస్సేన్ తదితర చిన్న పీర్లను కొలువు దీర్చారు. ఈ సందర్భంగా ముల్లాసాబ్ పీర్లకు నూతన వస్త్రాలు కట్టి, వెండి గొడుగులను తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి పార్థనలు చేశారు. సాయంత్రం మేళాలు, డప్పుల వాయిద్యాలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వాములకు చెక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చు కున్నారు. పీర్లను అగ్ని గుండం ప్రవేశం చేయించిన అనంతరం జలధికి తీసుకెళ్లారు.

అమడగూరు: మొహర్రంలో భాగంగా పలు గ్రామాల్లో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కస్సముద్రం, పూలకుంటపల్లి, తలమర్లపల్లిలో తొమ్మిది రోజుల క్రితమే గ్రామాల నడిబొడ్డున ఉన్న చావిళ్లలో పీర్లస్వాములను కొలువుదీర్చారు. ఆదివారం సాయంత్రం యవకులంతా తడిబట్టలతో పీర్లస్వాములను ఎత్తుకుని డప్పు వాయిద్యాల నడుమ పుర వీధుల గుండా ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిటకు పీర్లస్వాములను ఎత్తుకెళ్లగా భక్తులు పూజలు చేయగా ముజావర్ చదివింపులు చదివి ప్రసాదాలను పంచిపెట్టారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. చినగానిపల్లిలో పెట్టె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపు మంగళవారం బలకవారిపల్లిలో జలధిని చేపట్టనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కనగానపల్లి: మామిళ్లపల్లిలో ఆదివారం మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే పీర్ల స్వాములను గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. అనంతరం పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం జరిగిన జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక గ్రామస్తులతో పాటు చుట్టు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా యువకులు, పిల్లలు డప్పుచప్పుళ్లకు అలావు తొక్కారు. పీర్లస్వాములను అగ్ని గుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు.

బత్తలపల్లి: గరిశలపల్లి, నెత్తివారంపల్లి, సంగాల, నల్లబోయనపల్లి గ్రామాల్లోని పీర్ల జలధి కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించా. శనివారం రాత్రి పెద్ద సరిగెత్తులో భాగంగా చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పెద్ద ఎత్తున మంటలు రగిలించారు. గుండం చుట్టూ చిన్నా పెద్దా, ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అలావ్ తొక్కుతూ సంబరాలు చేసుకున్నారు. తెల్లవార్లు పీర్లను అందంగా ముస్తాబు చేసి ఆదివారం తెల్లవారుజామున గ్రామోత్సవం నిర్వహించారు. పీర్ల స్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించిన తరువాత మూగజీవాలను బలి ఇచ్చారు. అనంతరం స్వాములను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి జలధి కార్యక్రమం చేపట్టారు.

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి, తిప్పయ్యగారిపల్లి, పాత బత్తలపల్లి, ఎన్. ఎనుమలవారిపల్లి, చెరువువాండ్లపల్లి, పెమనకుంటపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం జలధి కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో శనివారం పెద్ద (సరిగెత్తు) పానకాలు నిర్వహించి పీర్ల స్వాములను ఊరేగించారు. ఆదివారం ఉదయాన్నే గుండం ముందు పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చారు. సాయంత్రం గుండం చుట్టూ యువకులు అలావు తొక్కారు. అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు.



చిగిచెర్లలో అలావ్ తొక్కుతున్న యువకులు

చిగిచెర్లలో..

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామంలో జలధి కార్యాక్రమాన్ని నిర్వహించారు. పెద్ద కాశీం స్వామి, చిన్న కాశీం స్వామి, మౌలాలి స్వామి, కుల్లాయిస్వామి పీర్లకు ముల్లాసాబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం పీర్లు బేటీ తీసుకున్నాయి. సాయంత్రం పీర్లను ఊరేగించి గుండం పూడ్చి వేసి ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు పెద్దిరెడ్డి గారి శివారెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి గారి ప్రభాకర్ రెడ్డి, సుబ్బప్ప గారి ఓబిరెడ్డి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 143 మందికి కంటి పరీక్షలు చేయగా 114 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి నరేంద్రరెడ్డి తెలిపారు. శిబిరం నిర్వహణకు సహకరించిన దాతలు కలవల మురళీధర్, కుమారుడు కలవల నాగతేజ, కోడలు సర్వాణి, మనవళ్లు మీహాన్, దిశాన్‌తోపాటు వైద్యులను సత్కరించారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి అనారోగ్యంతో మృతి



వాసంతి(ఫైల్)

బత్తలపల్లి: బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వాసంతి(47) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వాసంతి రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వారి సూచనల మేరకు బెంగుళూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు వైద్యులు తెలిరు. వాసంతికి భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.